




# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 28-05-2024 సంపుటి : 06 సంచిక : 254 పేజీలు : 8 వెల : రూ 3-00


# తీరం దాటిన రెమాల్ తుపాను





**బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో బీభత్సం**

**తీరందాటే సమయంలో తుపాను ఈదురుగాలులతో బీభత్సం**

**తుఫాను ధాటికి బెంగాల్‌లో ఇద్దరు మృతి**

**ఈదురుగాలుల ధాటికి వణికిన బెంగాల్, బంగ్లా తీరాలు**

**విరిగి పడ్డ విద్యుత్ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా**

**భారీ వర్షాలతో నీటమునిగిన అనేక ప్రాంతాలు**

**సహాయక చర్యల్లో నిమగ్నమైన విపత్తు నిర్వహణ బృందాలు**

కోల్‌కతా,మే27 ): రెమాల్ తుపాను తీరం దాటింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తీరందాటే సమయం లో తుపాను ఈదురుగాలులతో బీభ త్సం సృష్టించింది. 135 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలుల ధాటికి బెంగాల్, బంగ్లా తీరాలు వణికిపోయాయి. అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షాలు కురుస్తుండటంతో చాలా ప్రాంతాలు నీటమునిగాయి. తుపాను ప్రభావంతో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందుగానే తీరప్రాంతాల నుంచి సుమారు లక్షమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుపాను కారణంగా బంగ్లాదేశ్ లో ఇద్దరు మరణించారు. తీర ప్రాంతాల్లో భారీగా వరదలు సంభవించే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి కోల్ కతాలో విమాన సర్వీసులను నిలిపివేశారు అధికారులు. అలాగే తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలకు వచ్చే, వెళ్లే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. సహాయక చర్యల కోసం 16 బెటాలియన్లు, విపత్తు నిర్వహణ దళాలు సిద్ధంగా ఉన్నాయి. తుపాను కారణంగా నేలకూలిన చెట్లను తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనుల్లో విపత్తు నిర్వహణ బృందాలు నిమగ్నమయ్యాయి. తుపాను తీరం దాటి అల్పపీడనంగా బలహీన పడినా.. భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ స్పష్టం చేసింది. ప్రజలు ఇళ్లలోనే ఉండి.. తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల్లో రేపటి వరకూ విస్తారంగా వర్షాలు కురుస్తారని తెలిపింది. మరోవైపు పశ్చిమ గాలుల ప్రభావంతో ఏపీ, యానాంలలో ఉక్కపోత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అలాగే సాధారణం కంటే 2-4 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవు తాయని, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించారు. ఈ నెల చివరినాటికి నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. మహానగరంలో గరిష్టంగా గంటకు 74 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచగా, నగరం యొక్క ఉత్తర శివార్లలోని డమ్ డమ్ గరిష్టంగా 91 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు వాతావరణ కార్యాలయం తెలిపింది. కోల్‌కతాలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండి, బాధిత నివాసితుల కష్టాలను మరింత పెంచాయి. దక్షిణ కోల్‌కతాలోని బల్లీగంజ్, పార్క్ సర్కస్, ధాకురియా మరియు అలీపూర్, పశ్చిమాన బెహాలా మరియు ఉత్తరాన కాలేజ్ స్ట్రీట్, థాంథానియా కాలీ బారీ, %జ=% అవెన్యూ మరియు సింథిలోని ముఖ్యమైన పాకెట్‌లలోని వీధులు నీటిలో మునిగిపోయాయి. మరో వైపు.. సదరన్ అవెన్యూ, లేక్ ప్లేస్, చెట్లా, డిఎల్ ఖాన్ రోడ్, డఫెరిన్ రోడ్, బల్లిగంజ్ రోడ్, న్యూ అలీపూర్, బెహాలా, జాదవ్‌పూర్, గోల్‌పార్క్, హతిబాగన్, జగత్ ముఖర్జీ పార్క్, కాలేజ్ స్ట్రీట్ పక్కనే ఉన్న అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకూలినట్లు నివేదికలు సూచించాయి. కోల్‌కతాలో దాదాపు 68 చెట్లు నేలకూలాయి. సమీపంలోని సాల్ట్ లేక్, రాజర్‌హత్ ప్రాంతాల్లో మరో 75 చెట్లు నేలకూలాయి. తుఫాను కారణంగా దిఘా, కాక్‌ద్వీప్ మరియు జయనగర్ వంటి ప్రాంతాల్లో బలమైన గాలులతో వర్షం కురిసింది. ఇది సోమవారం ఉదయం తీవ్రమైంది. దక్షిణ బెంగాల్‌లోని ఇతర ప్రాంతాలలో హల్దియా (110 మిమీ), తమ్‌లుక్ (70 మిమీ) మరియు నింపిత్ (70 మిమీ) భారీ వర్షపాతం నమోదైంది. ఉత్తర మరియు దక్షిణ 24 పరగణాలు, పుర్బా మేదినీపూర్ జిల్లాలు విస్తృతంగా నష్టపోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కోల్‌కతా, నదియా, ముర్షిదాబాద్‌తో సహా దక్షిణాది జిల్లాల్లో మంగళవారం ఉదయం వరకు బలమైన ఉపరితల గాలులతో పాటు ఒకటి లేదా రెండు స్పెల్స్‌తో తీవ్రమైన వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు.

# ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




**త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించాలి**

**ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్**

అమరావతి మే 27: వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవో లు, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సందు తో కలసి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఓట్ల లెక్కింపుకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా దేశవ్యాప్తంగా జరుగుచున్న సార్వత్రిక ఎన్నికలను అందరి సమిష్టి కృషితో ఎంతో విజయవంతంగా జరుగుచున్నదని అభినందించారు. అదే స్ఫూర్తితో వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎం లను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద క్రౌడ్ మేనేజ్మంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాక్అప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్దంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్సులను కూడా సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబందించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే సరైన శిక్షణ నివ్వాలన్నారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐ.టి. పరికాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల సిద్దంగా ఉంచుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు లెక్కించే ఈవీఎం లను ఎడాపెడా పడేయకుండా ఒక క్రమ పద్దతిలో తీసుకురావడం, ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి "లెక్కింపు పూర్తి అయినట్లుగా" ఆయా ఈవీఎం లపై మార్కుచేస్తూ వెంటనే వాటిని సీల్ చేసి ఒక క్రమపద్దతిలో సురక్షితంగా భద్రపర్చాలన్నారు. అనవసరంగా ఈవీఎం లను అటూ ఇటూ మువ్ చేయవద్దని సూచించారు.

# సిఎం జగన్ అండతోనే భూదందా

**2వేల కోట్ల దందాపై విచారణ జరిపించాలి**

**కేంద్రానికి టిడిపి నేత బోండా ఉమ డిమాండ్**



విజయవాడ,మే27 : ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున భూదోపిడీ జరిగినా చర్యల్లేవని తెదేపా నేత, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. సీఎస్ జవహర్‌రెడ్డి ప్రమేయంపై ఆధారాలున్నా చర్యలు ఉండవా? అని ప్రశ్నించారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో బొండా ఉమా మాట్లాడారు.'సీఎం జగన్, ఆయన బంధువుల అండతో సీఎస్ జవహర్‌రెడ్డి భూ కుంభకోణానికి పాల్పడ్డారు. భోగాపురం మండలంలో సీఎస్ రూ.2వేల కోట్ల స్కామ్ చేశారు. జీవో 596 ద్వారా డీఫామ్ పట్టాలను కొట్టేస్తున్న తీరుపై విచారణ లేదా?ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగంపై తీసుకున్న చర్యలేవీ?ఈసీకి చాలాసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సీఈవో స్పందించనందున జవహర్‌రెడ్డి అక్రమాలపై దిల్లీలో సీఈసీకి ఫిర్యాదు చేస్తాం. సీఎస్ బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించాలి. అవసరమైతే హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరపాలి. డీ పట్టాలన్నీ సీజ్ చేసి అధికారులందరిపైనా విచారణ జరపాలి. ఆరోపణలు చేసిన వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. సీఎస్, ఆయన కుమారుడు, తాడేపల్లి పెద్దలు కలిసి భూదోపిడీకి పాల్పడ్డారు. నిజాలు వెలికితీసిన వ్యక్తులను సీఎస్ బెదిరిస్తున్నారు. జవహర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మా ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బొండా ఉమా డిమాండ్ చేశారు. రూ.2వేల కోట్ల విలువైన భూ కుంభకోణం సీఎం జగన్, ముఖ్యమంత్రి బంధువుల దయతోనే జరిగిందని టీడీపీ సీనియర్ నేత బోండా ఉమ ఆరోపించారు. జగన్ అండతో సీఎస్ జవహర్ రెడ్డి, ఆయన కుమారుడు, తాడేపల్లి పెద్దలు కలిసి ఈ భూ దోపిడీకి పాల్పడ్డారన్నారు.

## మాజీమంత్రి యెర్నేని సీతాదేవి కన్నుమూత

**గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి**

**సంతాపం తెలిపిన చంద్రబాబు తదితరులు**

హైదరాబాద్,మే27 : మాజీ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం గుండెపోటుతో ఆమె తుదిశ్వాస విడిచారు. సీతాదేవి స్వస్థలం ఏపీలోని కైకలూరు మండలం కోడూరు. ముదినేపల్లి నుంచి తెదేపా తరఫున ఆమె రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. సీతాదేవి మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. సీతాదేవి మృతిపట్ల తెదేపా అధినేత చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



విద్యాశాఖ మంత్రి సీతాదేవి తనదైన ముద్రవేశారని చంద్రబాబు కొనియాడారు. ఆ తర్వాత సీతాదేవి బీజేపీలో చేరారు. సీతాదేవి మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. యెర్నేని సీతాదేవి మాత్రమే కాకుండా ఆమె కుటుంబం కూడా రాజకీయ నేపథ్యం ఉన్నదే కావడం గమనార్హం. ఆమె భర్త నాగేంద్రనాథ్ ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య, కొల్లేరు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా, కృష్ణా, గోదావరి, పెన్నార్ డెల్టా డ్రెయినేజీ బోర్డు సభ్యుడిగా పని చేశారు.

# ఎపిలోనూ ఎన్‌డిఏ పాలన ఏర్పాటు



**వచ్చేది మళ్లీ మోడీ ప్రభుత్వమే**

**ఎండాకాలం ఎన్నికలకు ఇక ముగింపు పలుకుతాం**

**జమిలి ఎన్నికలతో వరుస ఎన్నికలకు స్వస్తి**

**కేంద్రహోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ**

న్యూఢిల్లీ,మే27(ఆర్ఎన్ఎ): విభజన సందర్భంగా ఎపికి ఒనగూర్చే ప్రయోజనాల విషయంలో కేంద్రం ఓ రకంగా చేతులు ఎత్తేసిందనే చెప్పాలి. కానీ చాలానే చేశామని బిజెపి ప్రకటించుకుంది. పైగా విశాఖ ఉక్కును తెగనమ్మే ప్రయత్నం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి వైఫల్యాలు అనేకం. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా ఒక్కటంటే ఒక్క మేలు చేయలేదు. అయినా ఎపిలో గణనీయంగా సీట్లు గెల్చుకో బోతన్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా వచ్చేది ఎన్డీయే సర్కారేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని సంపూర్ణ ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో తాము దాదాపు 17 లోక్‌సభ స్థానాలను గెల్చుకుంటామనీ విశ్వాసం వ్యక్తం చేశారు. సార్వత్రిక సమరంలో దేశవ్యాప్తంగా 400కుపైగా సీట్లు సాధిస్తామన్నారు. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సమయం వచ్చేసిందని షా అన్నారు. వాటితో ఎన్నికల వ్యయం దిగివస్తుందని పేర్కొన్నారు. మండే ఎండల్లో కాకుండా, మరేదైనా సమయంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడంపై కూడా దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌లలోనూ ఈ దఫా కమలదళం ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తుందని జోస్యం చెప్పారు. ఓ ప్రముఖ వార్తాసంస్థతో ఆయన పలు అంశాలపై మాట్లాడుతూ ఎపిలో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తుతందని అన్నారు. ఈసారి అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్ల కాలంలో విస్తృత సంప్రదింపుల అనంతరం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తాము అమలు చేయనున్నట్లు షా చెప్పారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే కాకుండా, విపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాల్లోనూ ఈ దఫా తమకు మెరుగైన ఫలితాలు వస్తాయని షా ధీమాగా పేర్కొన్నారు. 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో కమలదళం 75 స్థానాలు గెల్చుకుంటుందని అంచనా వేశారు. ఆ రాష్ట్రంలో 16-17 ఎంపీ సీట్లను తమ ఖాతాలో వేసుకుంటామని జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో17,పశ్చిమ బెంగాల్‌లో 24-32లోక్‌సభ స్థానాలు ఎన్డీయేకు దక్కుతాయనివిశ్వాసంవ్యక్తం చేశారు. యూసీసీని అమల్లోకి తీసుకురావాల్సిన బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల భుజస్కంధాలపై ఉంచారని షా పేర్కొన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 28-05-2024

## బిలినీయర్ల రాజ్యంగా మారుతున్న భారత్

దేశంలో డెమోక్రసీ ప్లూటోక్రసీగా మారింది. కోటీశ్వరులుగా.. మహా కోటీశ్వరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అవినీతి విశృంఖలమై.. నేర చరిత్ర కలవారు మన పాలకులయ్యి దేశం అల్లాడిపోతుంది. ప్రజల ఆదాయాలు జాతీయ ఆదాయంలో వారి వాటా క్రమంగా తగ్గిపోతున్నది.సంపద విషయానికొస్తే 2022-23 లో ఒక శాతం ధనికుల దగ్గర 40.1 శాతం సంపద ఉన్నది. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం ద్వారా 1990ల నుంచి ఈ ఆదాయ సంపద అసమానతలు గణనీయంగా పెరిగిపోయాయి. 1990 మధ్యకాలంలో ఇద్దరే ఇద్దరు ఉన్న మన బిలినీయర్లో ప్రస్తుతం 200 మందికి చేరారు. ఆనాడు ఆ ఇద్దరు బిలినీయర్ల ఆస్తుల విలువ 3.2 బిలియన్ డాలర్లు మాత్రమే. నేడు ఉన్న 200 బిలినీయర్ల ఆస్తుల విలువ 954 బిలియన్ డాలర్లు. ఈ విధంగా దేశ సంపద కొంతమంది చేతుల్లోకి పోవడం వలన ఆదాయ అసమానతలు పెరిగి మానవాభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ఒకవైపు కాంగ్రెస్ పార్టీ న్యాయ ప్రత్ అనే మేనిఫెస్టో ద్వారా, మరొకవైపు బీజేపీ సంకల్ప ప్రత్ అనే మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఏ మేరకు ఉచితాలతో నోరూరిస్తూ అధికారంలోకి ఎలా రావాలి అని తాపత్రయ పడుతున్నారే తప్ప ఆశేష పేద ప్రజానీకానికి సౌకర్యాలను వారి ఆర్థిక అభివృద్ధి తద్వారా సంక్షేమాన్ని ఆలోచిస్తున్నారా? అనే అనుమానం రాకపోదు.దేశ ఆర్థిక అభివృద్ధి తిరోగమనంలో ఉన్నప్పటికీ కార్పొరేట్ వర్గాలకు చెందిన పై స్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుంది. వీరి సంపదలోని పెరుగుదల ఏ విధమైన ఉత్పత్తి క్రమం నుంచి వచ్చింది కాదు. దేశ సహజ వనరులను దేశ సంపదను ప్రభుత్వమే కార్పొరేట్లకు తాయిలాలుగా ఇస్తోంది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థ చేతుల్లో దేశంలోని పోర్టులలో 25 శాతం, సిమెంట్ ఉత్పత్తులలో 45 శాతం, స్టీల్ పరిశ్రమంలో 33 శాతం, టెలికాంలో 60 శాతం, బొగ్గు ఎగుమతుల్లో 45 శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, దేశం సంపద ప్రైవేట్ గుత్త సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచారు. మరి సంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? ద్రవ్యలోటు పేరుతో ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరో పక్క బడా బాబులు బ్యాంకులకు బకాయి పడ్డ లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో బ్యాంకులకు బకాయిలు పడిన పెద్దలు 14.56 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేసి కేవలం 15 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. మూడేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు 12కి కుదించారు. 2021-22 లో ఎఫ్‌డీఐ రూపేనా 4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే.. 2022-23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి 3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా దెబ్బతిస్తున్నాయో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల పతనం చూస్తే తెలుస్తుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్న ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడుల కోసం ఎగబడుతూ చేయని పనిలేదు.1944లో బాంబే ప్లాన్ ప్రకారం.. స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ సహాయంతో పరిశ్రమ నెలకొల్పి పారిశ్రామికీకరణ జరపాలని నిర్ణయించారు. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో సామ్యవాద తరహా సమాజాన్ని స్థాపించాలని.. మన పాలకులు భారత రాజ్యాంగాన్ని రాసుకుని ప్రభుత్వమే అనేక సంస్థలను స్థాపించి సంక్షేమ రాజ్యం బాట పట్టించింది. కానీ నేడు విదేశీ పెట్టుబడులతో స్టాక్ మార్కెట్లో నిధులు కలిసి దేశాన్ని బిలినీయర్ల రాజ్యంగా మారుస్తున్నారు. స్వదేశీ విదేశీ పెట్టుబడి వర్గాల ప్రయోజనాల రక్షణకు భారీగా సబ్సిడీలు కల్పించి ప్రజా బహుళ ప్రయోజనాలు దెబ్బతీస్తున్నారు.1991లో ఆర్థిక మంత్రి హోదాలో ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ బ్యాంకులో 8 ఏళ్ల పాటు పనిచేసిన అనుభవంతో యూపీఏ ప్రభుత్వ హయాంలో లైసెన్సులపై ఆంక్షలను ఎత్తివేసి గుత్త సంస్థల నిరోధక చట్టాన్ని నామరూపాలు లేకుండా చేశారు. దేశీయ ఆర్థిక వ్యవస్థ తాళాలను, తాళం చెవులతో సహా విదేశీ గుత్త సంస్థలకు వీరి నీడలో ఎదుగదలుచుకున్న స్వదేశీ పారిశ్రామిక గుత్త సంస్థలకు పాలకులు అప్పగించారు. మేము మీ కన్నా గొప్ప దేశభక్తులమని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని బిలీనియర్ల రాజ్యంగా మారుస్తున్నది . ప్రస్తుతం దేశంలో 200 మంది బిలియన్లు ఉన్నారు.. అమెరికా చైనా తర్వాత ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశం మనదే. ప్రభుత్వం ప్రజల నుండి గడిస్తున్న ఆదాయం ఎవరి ప్రయోజనాల కోసం కార్పొరేట్ రంగానికి సబ్సిడీలు ఇచ్చేందుకేనా? ఉచితంగా భూములు కేటాయింపు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు చౌకరేట్లకు సహజ వనరుల అమ్మకాలు ఇవన్నీ ఎవరి కోసం? ఇక ప్రభుత్వాలు ఎందుకు? ప్రభుత్వ స్థానాన్ని ప్రైవేటు కార్పొరేట్ రంగం మెల్లగా అనుభవిస్తున్నది. రాజ్యాంగాన్ని రాసుకున్నది సర్వ సమానత్వాన్ని కోరుకునేది ఇందుకేనా?మార్చి 2024 లో వరల్డ్ ఇన్ క్వాలిటీ ల్యాబ్ అనే గ్లోబల్ పరిశోధన సంస్థ భారత్ బిలినీయర్ల రాజ్యం వైపుగా పరుగులు తీస్తున్నదని తెలిపింది.. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్లు రాజ్యాంగ భారత్ పరిణామం చెందుతున్నదని తెలిపారు. మన దేశంలో ఉన్నత ఆదాయ వర్గం వారు ఒకే ఒక శాతం ఉన్నప్పటికీ దేశంలోని జాతీయు ఆదాయంలో 22.6% పొందగలుగుతున్నారు. ఇంకా చెప్పాలంటే 0.1 శాతం ధనికులు మన దేశ జాతీయ ఆదాయంలో పది శాతం చేజిక్కించుకుంటున్నారు. ఇది ప్రపంచ దేశాల్లోనే ఎక్కువ.

## సీజనల్ వ్యాధులను అప్రమత్తంగా ఉండాలి... కమిషనర్




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 27 సోమవారం డోన్ పట్టణం మునిసిపల్ కమిషనర్ జయరామ్ ఆధ్వర్యంలో 18 వార్డ్ నందు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులు జ్వరం,డెంగు, మలేరియా, చికెన్ గున్యే గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ప్రజలను సూచించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని. డ్రైనేజీ మరియు నీటిని నిల్వా చేసుకునే ప్రదేశాలలో బయోటిక్స్ లార్వి సైడల్ స్ప్రే ని ఉపయోగించుకోవాలని తెలియజేసారు.అనంతరం పాతబస్టాండ్ సమీపంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఆధునిక సదుపాయలతో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ లను ప్రజలు అందరూ కూడా ఉపయోగించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సురేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ మహమ్మద్ భాషా మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


## ఫోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్ష మరియు రూ. 20 వేల జరిమానా విధింపు

గ్రేవ్‌కేస్‌లో కర్నూలు ఫోక్సో కేసుల స్పెషల్ కోర్టు తీర్పు దర్యాప్తు అధికారి , పి.పి , కోర్టు కానిస్టేబుల్ ను అభినందించిన ... కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్



విభారే న్యూస్ మే 27. కర్నూల్ ప్రతినిధి హోళగుంద పోలీసు స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో జరిగిన ఫోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్ష మరియు రూ. 20 వేల జరిమాన విధిస్తూ కర్నూలు ఫోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి జి. భూపాల్ రెడి గారు సోమవారం తీర్పు వెలువరించారు. 7 ఏళ్ళ బాలిక పై లైంగిక దాడి జరిగిన ఘటన పై కర్నూలు జిల్లా లోని హోళగుంద పోలీసుస్టేషన్ క్రైమ్ నంబర్: సి.ఆర్.నెం: 235/2021 యు/ సెక్షన్. 448, 506 ఐపిసి మరియు సెక్షన్ 6 ఆఫ్ పిఓసిఎస్ఓ అమెండ్‌మెంట్ ఏక్ట్ 2019 క్రింద ఆగష్టు 13 వ తేది 2021 లో కేసు నమోదు చేశారు.పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టి ఈ కేసులో చార్జ్ షీట్ దాఖలు చేశారునిందితుడు బోయ రంగముని, వయస్సు 31 సం.రాలు, తండ్రి గాది లింగప్ప, బి. జి హాల్లి గ్రామం( బొమ్మ గుండన హాళ్ళి గ్రామం), హోళగుంద మండలం. నిందితుడికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ. 20 వేలు జరిమానా విధిస్తూ అన్ని కోణాల్లో ఈ కేసును సమగ్రంగా విచారించి జడ్జి జి. భూపాల్ రెడ్డి గారు తీర్పు వెలువరించారు. జీవిత ఖైదు జైలు శిక్ష తో పాటు, 20 వేలు జరిమానా చెల్లించడంలో విఫలమైతే , నిందితుడు అదనంగా 3 నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించ వలసి ఉంటుందని తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారి అప్పటి ఆదోని డిఎస్పీ వినోద్ కుమార్ మరియు ప్రాసిక్యూషన్ తరుపున వాదించిన గోపాల కృష్ణ , కర్నూలు పోక్సో కోర్టు స్పెషల్ పిపి వెంకటేశ్వర రెడ్డి మరియు కోర్టు కానిస్టేబుల్ ఎస్. షేక్షావలి (పి.సి నెం. 76 హోళగుంద పి.యస్ ) లు చేసిన కృషిని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ గారు ప్రత్యేకంగా అభినందించార

## మహనీయులను, శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 27 న క్షయ వ్యాధికి కారణమైన మైకోబాక్టీరియా టూబర్ క్యూలాసిస్ ని కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీ రాబర్ట్ కోచ్‌వర్ధంతిమరియు సంఘ సంస్కరణ లకు ఆద్యుడు శ్రీ కందుకూరి వీరేశ లింగంవర్ధంతి సందర్భంగా డోన్ పట్టణంలోసామాజికవేత్త డోన్ పి.మ హమ్మద్ రఫి ఆధ్వర్యం లో మే 27 న క్షయ వ్యాధికి కారణమైన మైకోబా క్టీరియా టూబర్ క్యూలాసిస్ ని కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీ రాబర్ట్ కోచ్‌వర్ధంతి మరియు సంఘ సంస్కర ణలకుఆద్యుడుశ్రీకందుకూరి వీరేశ లింగం వర్ధంతిని పురస్కరించు కొని వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళ్ళు అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని అన్నారుడాక్టర్ శ్రీ రాబర్ట్ కోచ్ 11 డిసెంబర్ 1843 లో జన్మించారు.ఈయన జర్మనీకి చెందిన ప్రపంచ ప్రసిద్ధ వైద్యుడు మరియు శాస్త్రవేత్త. ఇతడు ఆంత్రాక్స్ వ్యాధికారకమైన బాసిల్లస్‌ఆంత్రసిస్ను (1877), క్షయ వ్యాధి కారకమైన మైకోబాక్టీరియాను (1882) మరియు కలరా వ్యాధి కారకమైన విబ్రియో కలరాను (1883) తొలిసారిగా గుర్తించాడు. క్షయ వ్యాధికి సంబంధించినదానిపై 1905లోవైద్య శాస్త్రంలో నోబెల్‌బహుమతి పొందాడు. ఈయన మే 27 - 1910 లో స్వర్గస్తులైనారు. విద్యార్థులు, యువత ఇలాంటి శాస్త్రవేత్తలను అనుసరించి వారి అడుగుజాడల్లో నడుస్తూ అనేక పరిశోధనలు చేసి దేశానికిసేవచెయ్యాలని రఫికోరారు. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 జన్మించారు. గొప్ప సంఘ సంస్కర్త తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి. సాహితీ వ్యాసంగంలోను కృషి చేసిన కందుకూరి బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు. వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి ప్రచారం చెయ్యడమేకాక,బాలికలకొరకుపాఠశాలలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు కూడా. వారికి ఉచితంగా చదువు చెప్పడంతో బాటు, పుస్తకాలు, పలకా బలపాలు కొనిచ్చేవాడు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేయటమే కాకుండా ఎన్ని కష్టాలెదురైన ఆచరణలో పెట్టాడు.మూఢ విశ్వాసాలు, సనాతనాచారాలపై ఆయన జరిపిన పోరాటము చిరస్మరణీయమైనది.వీరేశలింగం మే 27 -1919 స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను స్మరించుకుంటు వారి అడుగుజాడలల్లో నడవాలని ఆయన కోరారు

## ఆపద వస్తే ఆదుకోవడం అందరి బాధ్యత

కమాన్ పూర్. ఆపద వస్తే ఆదుకోవడం అందరి బాధ్యత అని ముత్తారం మాజీ జెడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్ అన్నారు.రామగిరి మండలం ఆదివారం పేట చెందిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం ముత్తారం మాజీ జెడ్పీటీసీ మైదం భారతి - వరప్రసాద్ అందజేశారు.తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కార్యక్రమం లో పాల్గొన్న గ్రామ అధ్యక్షులు మైదనీ బుచ్చయ్య మాజీ ఉపసర్పంచ్ అట్టే తిరుపతి రెడ్డి మాజీ ఎంపీటీసీ కన్నూరి నర్సింగరావు గ్రామ ఎస్సీసెల్ అధ్యక్షులు కన్నూరి శ్రీకాంత్ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి ఎండీ ఇస్మైల్ తదితరులు పాల్గొన్నారు...

## 19 లక్షల విలువ గల విత్తనాలు సీజ్



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 27-నంద్యాల పట్టణం లో సోమవారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు, ఆత్మకూరు ఎడీఎ ఆంజనేయులు నంద్యాల ఎడీఎ. రాజ శేఖర్. మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు కలిసి ఆకస్మికంగా పలు విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు . తనిఖీలో భాగంగా పలు విత్తన దుకాణాల యందు తనిఖీ చేయగా సరైన ధ్రువ పత్రాలు సమర్పించనందున ప్రత్తి మరియు మిరప 19 లక్షల విలువ గల విత్తనాలను అమ్మకపు నిలుపుదల చేయడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ శాఖ అధికారులు ఆత్మకూరు ఎడీఎ ఆంజనేయులు మాట్లాడుతూ విత్తన దుకాణాల యజమానులు అనుమతి ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలన్నారు , సరైన దృవ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు , నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలన్నారు ,ఎమ్ ఆర్ పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని తెలిపారు . విత్తనం కొన్న ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలన్నారు ..స్టాక్ బోర్డు ప్రతీరోజూ అప్డేట్ చెయ్యాలని స్టాక్ బుక్ మరియు గ్రౌండ్ బ్యాలెన్స్ సరిగా ఉండేట్లు చూసుకోవాలని హెచ్చరించారు.విత్తన చట్టం 1966 కి అనుగుణంగా అన్ని పాటించి వ్యాపారం చేస్కోవాలని అలా లేనిచో విత్తన చట్టం 1966 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .

## స్ఫూర్తి ఆధ్వర్యంలోపలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు...




విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 27 ప్యాపిలి మండలం రాచర్ల పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న డోన్ మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఆలా సురేష్ తల్లి స్వర్గీయ ఆలా. రామేశ్వరి జ్ఞాపకార్థం స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో సురేష్ వారి కుటుంబ సభ్యులతో కలిసి డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం ఏర్పాటు చేయించి వైద్యం కోసం వచ్చిన వందలాది మంది పల్లె ప్రజల ఆకలి తీర్చడం జరిగింది అలాగే మండల పరిధిలోని సోంపురం గ్రామానికి చెందిన భారతి, శ్రీ సుధాకర్ ర్ల పెళ్లి రోజు సందర్భంగా సుధాకర్ సహకారంతో స్ఫూర్తి సభ్యులు స్థానిక పద్మావతి వృద్ధాశ్రమం, కాశీనాయన సేవాశ్రమం నందు గల వృద్ధులకు, పట్టణంలో గల యాచకులకు భోజనాలు అందించి ఎంతోమంది వృద్ధుల, అన్నార్తుల ఆకలి తీర్చారు ఈ సందర్భంగా దాతలు కానిస్టేబుల్ సురేష్ కి, సోంపురం సుధాకర్ కి స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు.

## అగ్నికి ఐరన్ షాప్ కార్పెంటర్ షాపు దగ్ధం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 27-నంద్యాల పట్టణంలో సోమవారం నాగుల కట్ట దేవాలయంవద్ద ఉన్న ఐరన్ షాప్ మరియు కార్పెంటర్ షాపుల లో అగ్ని ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాష సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్ని బాధితులకు ప్రభుత్వం ద్వారా తగు న్యాయం చేస్తామని ఎమ్మెల్సీ ఇసాక్ బాష తెలిపారు.

## హుండీ లెక్కింపు కార్యక్రమమునకు భక్తులు హాజరు కావలెను....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 27 మంగళవారం అనగా 28-05-2024 న ఉదయం 8 గం., లకు స్వామి అమ్మవార్ల హుండీ లెక్కింపు కార్యక్రమము దేవస్థాన కళ్యాణ మండపం నందు ఉన్నది. కావున భక్తులు పాల్గొన వలసినదిగా కార్యనిర్వాహణాధికారి మరియు ధర్మకర్త మండలి చైర్మన్, సభ్యులు కోరడమైనది

# వైసీపీ విశ్వాసం వెనుక...

విశాఖపట్టణం, మే 27, ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు హైవోల్టేజ్ టెన్షన్ క్రియేట్ చేస్తున్నాయి. తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు మాత్రమే జరిగాయి. ఎవరికెన్ని సీట్లు వస్తాయన్న దానిపై పెద్దగా చర్చ కూడా లేదు. కానీ ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అక్కడ ఏ ప్రభుత్వం వస్తుందన్న దానిపై కనీ వినీ ఎరుగని రీతిలో బెట్టింగులు జరుగుతున్నాయి. ఫలితం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమయింది. ఇప్పుడు రాజకీయ పార్టీలు చేయగలిగిందేమీ లేదు. ఆట చివరి వరకూ తమదే విజయం అన్నట్లుగా పోరాడారు. ఫలితం మాత్రం తేలాల్సి ఉంది. కానీ మేమంటే మేము గెలుస్తామని రెండు పార్టీలు ప్రకటిస్తున్నాయి. రెండు పార్టీల్లో అధికార పార్టీ ఇంకా ఎక్కువగా తమ గెలుపు నమ్మకాన్ని ప్రదర్శించాలనుకుంటోంది. ఖచ్చితంగా గెలుస్తామని విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తామని చెబుతున్నారు. ఏపీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తాను రెండో సారి గెలి?సతే విశాఖ నుంచే పాలన చేస్తానని అక్కడే ప్రమాణస్వీకారం చేస్తానని ముందుగానే ప్రకటించారు. అందుకే రెండో సారి గెలిస్తే ఎక్కడ ప్రమాణం అనే ప్రశ్న వైసీపీలో లేదు. కానీ విశాఖలో వెన్యూ ఎక్కడ.. ఎప్పుడు అనేది కూడా ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ సీఎంగా రెండో జగన్మోహన్ రెడ్డి తొమ్మిదో తేదీన ప్రమాణస్వీకారం చేస్తారని దాదాపుగా ప్రతీ రోజూ చెబుతున్నారు. ముహుర్తాన్ని కూడా వైవీ సుబ్బారెడ్డి ఖరారు చేశారు. వచ్చే నెల 9న ఉదయం 9.30కి ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు ప్రకటించేశారు. మాములుగా అయితే జగన్ ప్రమాణ స్వీకార ముహుర్తాన్ని స్వరూపానంద ఖరారు చేస్తారు. ఆయనను సంప్రదించి వైవీ సుబ్బారెడ్డి ముహుర్తాన్ని ఖరారు చేశారో.. టీటీడీ చైర్మన్ గా ఉన్న అనుభవంతో ఆయనే పెట్టేశారో స్పష్టత లేదు. తాజాగా హోటల్ రూముల్ని బుక్ చేస్తున్నామని చెబుతున్నారు. విశాఖలో ఉన్న స్టార్ హోటల్స్ అన్నింటినీ తొమ్మిదో తేదీ కోసం బుక్ చేస్తున్నామని జగన్ ప్రమాణస్వీకారానికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలే కాదు.. ఇతర రాష్ట్రాల నుంచి ప్రముఖులు వస్తారని అంటున్నారు.



బోగాపురం ఎయిర్ పోర్టు దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశంలో అత్యంత భారీగా బహిరంగసభలో ప్రమాణస్వీకారం చేయాలా.. లేకపోతే విశాఖలో ఏయూ గ్రౌండ్ లో చేయాలా అన్నదానిపై పరిశీలన చేస్తున్నామని చెబుతున్నారు. ఇక్కడ విశేషం ఏమిటంటే కేవలం వైసీపీ నేతలే ఏర్పాట్లలో మునిగి ఉండటం లేదు.. అధికారులు కూడా ఏర్పాట్లలో పాల్గొంటున్నారని అంటున్నారు. సీఎస్ జవహర్ రెడ్డి రెండు సార్లు సీక్రెట్ గా విశాఖకు వచ్చారు. ఓ సారి బోగాపురం వెళ్లి పరిశీలించారు. మరికొంత మంది ఉన్నతాధికారులు కూడా వచ్చి వెళ్లారని చెబు?న్నారు. వీరంతా వచ్చింది జగన్ రెండో సారి ప్రమాణస్వీకార ఏర్పాట్లపై పరిశీలన చేయడానికేనని అంటున్నారు. సాధారణంగా ఫలితాలు ఈవీఎంలతో నిక్షిప్తమయ్యాక రాజకీయ పార్టీల రిలాక్స్ అయిపోతాయి. సమయం ఉంటే పోలింగ్ సరళిని విశ్లేషించుకుంటారు. నిజానికి పోలింగ్ సరళి వల్ల ఫలితాలు అంచన వేయడం అ?సాధ్యం. తమ కు గతంలో ఎక్కువ ఓట్లు ఎక్కడ వచ్చాయో.. అక్కడ ఓటింగ్ శాతం ఎలా ఉందో చూసుకుంటాయి. ఏ ఏ సామాజికవర్గాల ఓట్లు ఎక్కువగా పోలయ్యాయో తెలుసుకుని అంచనా వేసుకుంటారు. ఇవేమీ ఖచ్చితమైన ఫలితాన్ని ఇవ్వలేదు. ఫలితాల తర్వాత ఎక్కువగా ట్రోలింగ్ కు గురి కాకుండా ఉండేందుకు సంయమనం పాటిస్తాయి.

పార్టీ కార్యకర్తల్లో స్థైర్యం ఉండేలా.. గెలుస్తున్నామన్న నమ్మకాన్ని కలిగించేందుకు గీత దాటకుండా ప్రయత్నాలు చేస్తాయి. కానీ వైఎస్ఆర్‌సీపీ మాత్రం తమ నమ్మకాన్ని ప్రజల ముందు ప్రదర్శించాలనుకుంటోంది. అది ప్రమాణస్వీకార ముహుర్తం.. ప్రమాణస్వీకార వేదిక ఏర్పాట్లు ప్రారంభించడం. . హోటల్ రూమ్స్ బుక్ చేసుకోవడం వరకూ వెళ్లడమే ఆసక్తికరంగా మారింది. అత్యధిక పోలింగ్ నమోదు కావడం , మధ్యతరగతి వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉండటం, ఉద్యోగ వర్గాలు కూడా పూర్తి స్థాయిలో వ్యతిరేకంగా పని చేశాయన్న విశ్లేషణల మధ్య వైఎస్ఆర్‌సీపీకి ఎదురుగాలి వీస్తోందన్న ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం కూడా వైసీపీకి ఇబ్బందికరంగా మారిందన్న అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో ప్రముఖ సెఫాలజిస్టులు అందరూ ఈ సారి ఎన్నికల్లో ఏపీలో ప్రభుత్వం మారుతుందన్న అంచనాలను వేయడం ప్రారంభించారు. ఇవి జాతీయ మీడియాలో హైలెట్ అవుతున్నాయి. అలాగే ఎన్నికలకు ముందు వచ్చిన జాతీయ మీడియాల ఒపీనియన్ పోల్స్ లోనూ వైసీపీకి సంతృప్తికరమైన ఫలితాలు రాలేదు. ఈ క్రమంలో వైసీపీ నేతల్లోనే గందరగోళం ఏర్పడింది. ఓ వైపు ఈసీ అక్రమాలు అని పోరాడుతూండటంతో ఫలితాలపై క్లారిటీ ఉందని.. అందుకే ఇలా చేస్తున్నారన్న అభిప్రాయం పెరుగుతోంది. దీన్ని కంట్రోల్ చేసేందుకే .. ప్రమాణస్వీకార తేదీ, ముహుర్తం, వేదిక పేరుతో హడావుడి చేస్తున్నారన్న అభిప్రాయం గట్టిగా ఉంది. ముందే హైకమాండ్ జావకారిపోతే కౌంటింగ్ సెంటర్లలో ఏజెంట్లు కూడా ధైర్యంగా ఉండలేరని.. అక్కడ ఏజెంట్ల లేకపోతే సమస్యలు వస్తాయని ఇలాంటి నమ్మకాన్ని ప్రదర్శిస్తోందని టీడీపీ నేతలు విశ్లేషిస్తున్నారు. వైఎస్ఆర్‌సీపీ ముఖ్య నేతల గెలుపు నమ్మకం ప్రదర్శన కాస్త అతిగానే ఉంది. ఫలితాలు రోజున.. తాము అనుకున్నట్లుగా గెలిస్తే పర్వాలేదు.. ఫలితం తేడా వస్తే.. మాత్రం సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రోల్ చేస్తారు. అటు ఓటమి బాధతో పాటు గెలిచినపార్టీ నేతల ట్రోలింగ్ ను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

## పవన్ చెప్పినట్టే... హ్యూమన్ ట్రాఫికింగా...

విశాఖపట్టణం, మే 27, అనేక మంది మహిళలు, తెలుగు వాళ్లు అదృశ్యమవుతున్నారంటూ పవన్ కల్యాణ్ చేసిన విమర్శలు గతంలో సంచలనం సృష్టించాయి. అయితే అదంతా అబద్ధమని ఆయనపైకేసులు పెట్టింది ప్రభుత్వం. ఇప్పుడు బయట పడుతున్న ఘటనలు చూస్తే పవన్ కళ్యాణ్ భయపడినట్టే జరిగిందన్న వాదన వినిపిస్తోంది. ఒక్క కంబోడియా లోనే బానిసలుగా 5000 మంది మనవాళ్ళు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. ట్రాఫికింగ్ బాధితులు చెబుతున్న విషయాలు సామాన్యుల్ని భయానికి గురి చేస్తున్నాయి. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని తీసుకెళ్ళి చైనా గ్యాంగ్ లకు అమ్మేస్తున్నారు కేటుగాళు.. అలా కొనుక్కున్న భారతీయుల్ని హింసించి మనదేశం పైనే సైబర్ దాడి చేసే ఆయుధాలుగా మారుస్తున్నారు. వీరిలో 58 మందిని రక్షించి వైజాగ్ కు తీసుకొచ్చారు వైజాగ్ పోలీసులు. వీరిలో 40 మంది తెలుగువాళ్ళు కాగా మిగిలిన 18 మంది ఇతర రాష్ట్రాల వాళ్ళు ఉన్నారు. విదేశాల్లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు అంటూ గాజువాకకు చెందిన చుట్టా రాజేష్ సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చాడు.

# కౌంటింగ్ కు ప్రత్యేక అధికారులు

విజయవాడ, మే 27,ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా కొన్నిచోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. పోలింగ్ అనంతరం కూడా పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు చెలరేగాయి. ఈ క్రమంలో రాష్ట్ర పోలీస్ శాఖ అప్రమత్తమైంది. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతోంది. ప్రతి జిల్లాకు ప్రత్యేక పోలీస్ అధికారులను నియమించింది. ఈ మేరకు 56 మంది ప్రత్యేక పోలీస్ అధికారులను నియమిస్తూ.. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. అత్యధికంగా పల్నాడు జిల్లాకు 8 మంది పోలీస్ అధికారులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరు వెంటనే ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాలని సూచించారు. సున్నితమైన సెగ్మెంట్లలో లా అండ్ ఆర్డర్ బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని నిర్దేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని.. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు, పల్నాడులో 144 సెక్షన్ కొనసాగుతోంది. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంచేందుకు జూన్ 5 వరకూ ఇది కొనసాగుతుందని ఎస్పీ మల్లికాగార్గ్ తెలిపారు. కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న వేళ జిల్లాలోని అన్ని ముఖ్య నియోజకవర్గాల్లో భారీగా పోలీసులను మోహరించారు. అన్ని గ్రామాల్లోనూ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. అటు, సిట్ కేసుల్లో శనివారం ఒక్క రోజే 13 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. హింసాత్మక ఘటనల కేసులకు సంబంధించి నరసరావుపేట సబ్ డివిజన్‌లో 01, సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో 46, గురజాల సబ్ డివిజన్‌లో 27 మందిని.. మొత్తం 74 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో భద్రతను ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అటు, అనంతపురం జిల్లాలోని కౌంటిగ్ కేంద్రాల వద్ద కూడా భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. జేఎన్టీయూ కౌంటింగ్ కేంద్రాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తూ.. కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేశారు. జిల్లాకు ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈవీఎంలు భద్రపరిచిన కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా ఇదే స్థాయిలో ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ సహా.. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో భద్రతను పర్యవేక్షించనున్నారు. జిల్లాల్లోని అన్ని కౌంటింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. కేంద్రాల వద్ద హైస్పీడ్ ఇంటర్నెట్, టేబుళ్ల నిర్వహణ, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఈవో ఎంకే మీనా ఆదేశించారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బందికి, అధికారులకు, ఏజెంట్లకు, నియోజకవర్గం అభ్యర్థులకు అల్పాహారం, భోజనం, మంచినీళ్లు సహా ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదు. వీటిని భద్రపరిచేందుకు ప్రతి కేంద్రంలోనూ ఓ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నారు.

# కౌంటింగ్ ఏజెంట్లు చేయాల్సింది ఇదే

విజయవాడ, మే 27, : ఈ నెల 13న తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ ముగిసింది. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ సాగనుంది. ఇప్పటికే స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతతో ఈవీఎంలు పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ రోజున తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపట్టిన అనంతరం ఈవీఎంల్లో ఓట్లు లెక్కిస్తారు. ఈ క్రమంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, టేబుళ్ల ఏర్పాటు, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు చేపడుతున్నారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలోనే మీడియా సెంటర్లు ఏర్పాటు చేసి బిగ్ స్క్రీన్స్‌లో ఫలితాలు వెల్లడయ్యేలా ప్రణాళికలు రచిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద హైస్పీడ్ ఇంటర్నెట్ ఉపయోగించనున్నారు. కాగా, కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కౌంటింగ్ ఏజెంట్లు కేంద్రాలకు ఉదయం 6 గంటల్లోపు వెళ్లాలి. ఫాం 18పై రిటర్నింగ్ అధికారితో సంతకం చేయించి తీసుకోవాలి. అనంతరం మీకు ఇచ్చే ఐడీ, ఆధార్, ఫాం 17అ, బుక్ లెట్, పెన్ తీసుకెళ్లాలి. కౌంటింగ్ కేంద్రాలకు మొబైల్స్ అనుమతించరు. ఒకసారి లోపలికి వెళ్లాక మళ్లీ ప్రక్రియ పూర్తయ్యే వరకూ బయటకు వచ్చేందుకు అనుమతించరు. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల ఫలితాలకు సంబంధించి వేర్వేరుగా కౌంటింగ్ హాల్స్ ఉంటాయి. మీకు కేటాయించిన టేబుల్ నెంబర్ వద్ద కూర్చోవాలి. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ ఆఫీసర్, అబ్జర్వర్ ఉంటారు. అలాగే, ఓ ఆర్వో, ఓ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఏజెంట్ ఉంటారు. ఏ పోలింగ్ బూత్‌ల నుంచి కంట్రోల్ యూనిట్స్ ఏ టేబుల్‌కు వెళ్లాలనేది ముందుగానే నిర్ణయిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ తర్వాత, ఈవీఎంల కౌంటింగ్ ఉంటుంది. ఏజెంట్లు కంట్రోల్ యూనిట్ల యంత్రాల సీల్స్ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. లేకుంటే రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి. అనంతరం 17అ ఫాం వివలు అధికారులు చెప్పిన వాటితో సరి చూసుకోవాలి. ఫలితాలు వెల్లడవుతున్నప్పుడు పోలింగ్ తేదీ, పోలైన ఓట్లను సరి చూసుకోవాలి. మీ దగ్గర ఉన్న 17అ ఫాంలోని వివరాలు అక్కడ వాటితో తేడాగా ఉంటే రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి. ఫలితాలు వెల్లడి సమయంలో మీ అభ్యర్థి వివరాలతో సహా అన్నీ నోట్ చేసుకోవాలి. మీతో పాటు అన్ని ఫలితాలను కూడా కౌంటింగ్ సూపర్వైజర్ కూడా నోట్ చేస్తారు. ఫలితాలు మీరు మళ్లీ చూడాలని అనుకుంటే రిటర్నింగ్ అధికారిని అడిగితే మెషీన్ లో బటన్ నొక్కి చూపిస్తారు. అంతా సవ్యంగా పూర్తైతే కౌంటింగ్ సూపర్వైజర్ ఇచ్చిన 17అ ఫాం పార్ట్ 2పై సంతకం చేయాలి. అందరికీ సమ్మతమైతే ఆ ఫాంను ఆర్వోకు అందించి ఫలితాలు వెల్లడిస్తారు.'ఫాం 17అ' ఇంకో అధికారికి అందిస్తారు. ఆ వివరాలు 'ఫాం 20'లో భద్రపరుస్తారు. నియోజకవర్గంలో అన్ని కంట్రోల్ యూనిట్స్ పూర్తైన తర్వాత వీపీ ప్యాట్ మెషీన్స్‌లో పేపర్ స్లిప్స్ కౌంట్ చేస్తారు. ఈ నెంబరు దానికి సంబంధించి కంట్రోల్ యూనిట్‌లో నెంబర్ సరిపోలుస్తారు. ఈ సమస్యలుంటే..కంట్రోల్ యూనిట్స్ తెచ్చినప్పుడు సీల్స్ సరిగ్గా లేకున్నా.. రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి. గ్రీన్ సీల్ బ్రేక్ అయి ఉంటే ఆర్వోకి చెప్పాలి. ఆయన అది తీసుకెళ్లి దానికి సంబంధించిన వీవీ ప్యాట్ మెషీన్ ను తెప్పించి దానిలో స్లిప్స్ కౌంట్ చేస్తారు. అయితే, ఈ ప్రక్రియ కౌంటింగ్ చివరలో సాగుతుంది. ఒకవేళ కంట్రోల్ యూనిట్ ఆన్ కాకుంటే ఆర్వోకి తెలియజేయాలి. ఆయన సరిచేస్తారు. అప్పటికీ పని చేయకపోతే.. పక్కకు తీసుకెళ్లి ఆ కంట్రోల్ యూనిట్ కు సంబంధించి వీవీ ప్యాట్ స్లిప్స్ కౌంట్ చేస్తారు. మీ '17అ ఫాం' లోని మొత్తం ఓట్లు కంట్రోల్ యూనిట్‌లో చూపించిన ఓట్లు తేడా ఉంటే ఆర్వోకి తెలియజేయాలి. ఏజెంట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ బయటకు రావద్దు. ఇంకా ఏమైనా సందేహాలుంటే ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్‌లో చూసుకోవాలి. ఫామ్ 17అ ఏంటంటే?ఎన్నికల రోజు ప్రతి బూత్‌లో పోలింగ్ పూర్తైన తర్వాత మొత్తం ఎన్ని ఓట్లు పోలయ్యాయనే వివరాలతో ప్రిసైడింగ్ అధికారి సంతకంతో పార్టీల ఏజెంట్లు 'ఫామ్ – 17అ' తీసుకుంటారు. ఇందులో పోలింగ్ స్టేషన్ పేరు, కోడ్ నెంబర్ వంటి వివరాలు సైతం ఉంటాయి. ఈ ఫామ్స్‌ను నియోజకవర్గ పార్టీ ఆఫీస్‌లకు పంపుతారు. కౌంటింగ్ రోజు వీటిని ఏజెంట్లు తమ వెంట తీసుకెళ్తారు. ప్రతి ఈవీఎంలోనూ పోల్ అయిన ఓట్లకు, ఫామ్ – 17అలో నమోదు చేసిన ఓట్లకు లెక్క సరిపోలాలి. ఒకవేళ ఏమైనా తేడా ఉంటే రిటర్నింగ్ అధికారికి తెలియజేయాల్సి ఉంటుంది.



# మన్యంలో జ్వరాలు

విజయనగరం, మే 27, పార్వతీపురం మన్యం జిల్లాలో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో వైరల్ ఫీవర్స్ తాండవిస్తున్నాయి. రోగులు సంఖ్య పెరగడంతో ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. సిబ్బందికి వైద్య సేవలు అందించడం కూడా కష్టతరంగా మారుతుంది. పలు గ్రామాల్లో ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరాల బారిన పడ్డారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. చేసేదేమిలేక గ్రామాల నుండి ఆసుపత్రుల బాట పడుతు న్నారు రోగులు. అక్కడ కూడా రోగుల సంఖ్య పెరగడంతో బెడ్స్ కొరత, మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ గ్రామాల్లో పారిశుధ్య సమస్య నరకం చూపిస్తుంది. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగు కాలువలు, రోడ్లు చిత్తడిగా మారడంతో స్థానికులకు దుర్వాసనలతో కాలం గడపాల్సి వస్తుంది. ప్రధానంగా ఈ సమస్య పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, సాలూరు మండలాల్లో తీవ్రంగా కనిపిస్తుంది. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల తాకిడి పెరగడంతో వైద్య సదుపాయాలు కూడా ఇబ్బందిగా మారుతుంది. పలువురు రోగులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్స్ లేకపోవడంతో ప్రవేట్ హాస్పిటల్స్?కి వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. అధికారులు త్వరితగతిన గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కరించకపోతే తాము మరింత ఇబ్బంది పడక తప్పదు అని వాపోతున్నారు జిల్లావాసులు. కొమరాడ మండలం అంటివలసలో ఈ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇంటికి ఒకరు, లేదా ఇద్దరు మంచంబారిన పడ్డారు. మలేరియా కేసులు రోజురోజుకు పెరుగుతుండగా, డెంగ్యూ సోకే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు అటు వైద్య సిబ్బంది, ఇటు జిల్లావాసులు. పారిశుధ్య సమస్య కారణంగా ఏజెన్సీవాసులు అనారోగ్యబారిన పడుతున్నా.. అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మన్యం ఏజెన్సీవాసులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు గిరిజన సంఘాల నాయకులు.




# కర్నూలు జిల్లాల్లో వజ్రాలు...

కర్నూలు, మే 27, కర్నూలు జిల్లాలో వరుసగా వజ్రాలు లభ్యమవుతున్నాయి. జిల్లాలోని తుగ్గలి మండలం జొన్నగిరిలో ఒకే రోజు రెండు వజ్రాలు లభ్యమయ్యాయి. వీటిని వేలం వేయగా ఓ వజ్రానికి రూ.6 లక్షలు, 6 తులాల బంగారం ఇచ్చి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. మరో వజ్రాన్ని ఇంకా వేలం వేయలేదు. దీని విలువ రూ.12 లక్షలు పలుకుతుందని అంచనా వేస్తున్నారు. ఈ వారం రోజుల్లోనే దాదాపు 10 వజ్రాలను ఎవరికీ తెలియకుండా కొనుగోలు చేసినట్లు సమాచారం. కాగా, వర్షాకాలంలో స్థానికులు వజ్రాల కోసం పెద్ద ఎత్తున పొలాల్లో వేట సాగిస్తుంటారు. జిల్లాలోని జొన్నగిరి, తుగ్గలి, మద్దికెరా, పగిడిరాయ్, పెరావళి, మహానంది, మహాదేవపురం ప్రాంతాల్లోని పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతుంటారు. వర్షాకాలం ప్రారంభమైన జూన్ నుంచి నవంబర్ వరకూ ఈ వేట కొనసాగుతుంది. అటు, శనివారం మదనంతపురంలో ఓ రైతు పొలంలో విలువైన వజ్రం బయటపడింది. రైతు దాన్ని ఇంటికి తీసుకెళ్లి భద్రపరిచారు. వజ్రాన్ని పరీక్షించే లోపే వ్యాపారులు సదరు రైతు ఇంటి ముందు క్యూ కట్టారు. వజ్రాన్ని రూ.18 లక్షల నగదు, 10 తులాల బంగారం ఇచ్చి దాన్ని కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.30 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్థులు పొలాల్లోకి వజ్రాల వేట కోసం పరుగులు తీశారు. అలాగే, మద్దికెర మండలం హంప గ్రామస్థునికి ఓ వజ్రం దొరికింది. దీన్ని పెరవలి గ్రామానికి చెందిన వ్యాపారి కొనుగోలు చేసినట్లు సమాచారం. రూ.5 లక్షలతో నగదుతో పాటు 2 తులాల బంగారం ఇచ్చి వజ్రాన్ని సదరు వ్యాపారి దక్కించుకున్నట్లు తెలుస్తోంది. కాగా, వర్షాకాలంలో వజ్రాల కోసం స్థానిక పొలాల్లో స్థానిక గ్రామస్థులు సహా ఇతర ప్రాంతాల నుంచి సైతం భారీగా తరలివచ్చి వెతుకుతుంటారు. పొలాల్లో దొరికిన వజ్రాలను రహస్యంగా వ్యాపారులకు అమ్మేస్తుంటారు. వ్యాపారులు కూడా ఆ ప్రాంతాలకు స్థానికంగానే మకాం వేస్తారు. వజ్రాలకు పోటీ ఎక్కువైన సందర్భంలో వేలం వేస్తారు. ఆ వేలంపాటలో బంగారం, డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తుంటారు. కర్నూలు జిల్లా వాసులే కాకుండా.. అనంతపురం, కడప, ప్రకాశం, బళ్లారి ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ నుంచి కూడా ప్రజలు వచ్చి ఇక్కడ వజ్రాల కోసం వెతుకుతుంటారు.



## రీ సర్వే పేరుతో రైతుల భూములు ఆన్లైన్ తొలగింపు...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 27 డోన్ మండల పరిధిలోని వలసల గ్రామంలో రీ సర్వే పేరుతో రైతుల భూములు ఆన్లైన్లో తొలగించారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో దాదాపు రిజిస్టర్ ల్యాండ్ 40 శాతం ఉండగా డి పట్టా ల్యాండ్ 60 శాతం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు అయితేరీ సర్వేలో మొత్తం భూమి 60 శాతం డి పట్టా కు చెందినది కావున మొత్తం రైతు పేరులను ఆన్లైన్లో తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ తొలగింపు కార్యక్రమం లో ప్రధాన పాత్ర సర్వేర్ సూర్య దే అని రైతులు చెబుతున్నారు గ్రామంలోని దాదాపు500 మంది రైతుల భూములను ఆన్లైన్లో తొలగించారన్నారు 70 సంవత్సరాలుగా సాగు చేస్తున్న రైతుల భూములు కూడా ఆన్లైన్లో తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామం లో ఒక్కొక్క రైతుకు కనీసం 6,7,8 ఎకరాల భూమి పట్టాదారిపాస్ పుస్తకం కలిగి ఉన్నారు కానీ ఇప్పుడు క్రాప్ లో సీజన్ కావున ఆన్లైన్లో తొలగించిన తర్వాత వన్ బి అడంగల్ తీసుకుంటే ఒక ఎకరా 40 సెంట్లు భూమి ఒక పాసు పుస్తకం పైన వస్తుందికానీ 8 ఎకరాలు 5 ఎకరాలు 6 ఎకరాలు ఉన్న రైతు క్రాప్ లో మూడు లక్షలు తీసుకున్నారు ఇప్పుడు క్రాప్ లోను కట్టడానికి పోతే ఎకరా 40 సెంట్లు 30 సెంట్లు ఆన్లైన్లో చూపిస్తుందిదీనికి బాధ్యులు ఎవరు మూడు లక్షల రూపాయలు క్రాప్ లోను ఎలా కట్టాలి అసలే వలసల గ్రామంలో వర్షాధార భూములు తప్ప బోరు బావులు లేవు పంటలు పండితేనే తప్ప ఎలాంటి జీవనాధారం లేదు పంటలు పండగ పోతే వలస కూలీలుగా గుంటూరుకి మిరపకాయలకు వెళతారు లేదంటే మల్కాపురం వచ్చి ట్రాక్టర్ పనులు చేసుకుంటారు అటువంటప్పుడు రైతులు క్రాప్ లోన్స్ ఎలా కట్టాలి పిల్లల చదువులు ఎలా చదివించుకోవాలి పిల్లల పెళ్లిళు ఎలా చేసుకోవాలి వాళ్ళ కడుపు ఎలా నింపుకోవాలి ఎలా బ్రతకాలి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతుల కడుపు కొట్టిన సర్వేర్ ని సస్పెండ్ చేసి మా పొలాలు యధావిధిగా ఆన్లైన్లో ఎక్కించి వలసల గ్రామ రైతుల ను ఆదుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## హంతకులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపడతాం... కోట్ల హామీ



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:- బేతంచెర్ల మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాణాల హరి ప్రసాద్,38 సంవత్సరములు మొన్న వైసిపి నాయకుల చేతిలో గోరంగా దారుణ హత్యకు గురైన విషయము తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు డోన్ అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి అయిన కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సోమవారం రుద్రవరం గ్రామానికి వెళ్లి హత్యకు గురైన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి కల్పించడం జరిగింది హంత కులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పార్టీ నుండి అన్ని విధాలుగా అండదండ ఉంటుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు బేతంచెర్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నా రు.

## ఆర్ యు కౌంటింగ్ సెంటర్లో మొబైల్ డిపాజిట్ టోకెన్ సిస్టం కౌంటింగ్ హాల్ లో అదనపు లైటింగ్ ఏర్పాట్లు :జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన





విభారేన్యూస్ కర్నూలు మే 27, రాయలసీమ యూనివర్సిటీలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో మొబైల్ డిపాజిట్ సెంటర్లలో టోకెన్ సిస్టంతో పాటు కౌంటింగ్ హాల్ లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూం లో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్ ను పరిశీలించిన అనంతరం ఈవీఎమ్ యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్ ను, కౌంటింగ్ హాల్ ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఎక్కువ సమయం పడుతుందని అందుకు గాను రాయలసీమ యూనివర్సిటీలోని పార్కింగ్ ప్రదేశంలో, యూనివర్సిటీ మొత్తం అదనపు లైటింగ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఈ ని, మొబైల్ డిపాజిట్ సెంటర్లలో మొబైల్ డిపాజిట్ చేయించుకున్న అనంతరం సంబంధిత వారికి టోకెన్ ఇచ్చే విధంగా టోకెన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని డ్వామా పిడి ని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ మెటీరియల్ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు హ్యాండోవర్ చేశారా? లేదా ? అని డ్వామా పిడి ని కలెక్టర్ ఆరా తీశారు? సంబంధిత రిటర్నింగ్ అధికారులకు కౌంటింగ్ మెటీరియల్ హ్యాండోవర్ చేయడం జరిగిందని డ్వామా పిడి కలెక్టర్ కి వివరించారు. మొబైల్ డిపాజిట్ సెంటర్, ఫుడ్ కౌంటర్, త్రాగు నీరు, ఏజెంట్ ఐడెంటిఫికేషన్ కౌంటర్ ఏర్పాట్ల పనులు ఎంతవరకు వచ్చాయని సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్





విభారే న్యూస్ కర్నూలు మే 27, వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవో లు, ఆయా నియెజకవర్గాల ఆర్వోలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సందు తో కలసి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఓట్ల లెక్కింపుకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారీగా దేశవ్యాప్తంగా జరుగుచున్న సార్వత్రిక ఎన్నికలను అందరి సమిష్టి కృషితో ఎంతో విజయవంతంగా జరుగుచున్నదని అభినందించారు. అదే స్ఫూర్తితో వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎం లను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాక్అప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్సులను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబందించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐ.టి. పరికాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు లెక్కించే ఈవీఎం లను ఎడాపెడా పడేయకుండా ఒక క్రమ పద్ధతిలో తీసుకురావడం, ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి "లెక్కింపు పూర్తి అయినట్లుగా" ఆయా ఈవీఎం లపై మార్కుచేస్తూ వెంటనే వాటిని సీల్ చేసి ఒక క్రమపద్ధతిలో సురక్షితంగా భద్రపర్చాలన్నారు. అనవసరంగా ఈవీఎం లను అటూ ఇటూ మువ్ చేయవద్దని సూచించారు. ఎలక్ట్రానిక్ ట్రాన్సుఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఇఖఃఓూ) ను చక్కగా నిర్వహించాలని, వాటి లెక్కింపుకు సంబందించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించే విషయంలో ఏమాత్రము ఆలశ్యం చేయవద్దని, డిస్ప్లే బోర్డుల ద్వారా ఎప్పటి కప్పుడు ఖచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, అదనపు సీఈఓ లు పి కోటేశ్వరరావు, ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. అదే విధంగా ఐదు దశలో ఎన్నికలు జరిగిన ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిస్సా మరియు సిక్కిం అసెంబ్లీలతోపాటు 543 పార్లమెంటరీ నియోజకవర్గాలకు చెందిన ఆర్వోలు, డి ఈ ఓ మరియు ఆయా రాష్ట్రాల చీఫ్ ఎలెక్టోరల్ అధికారులు వారి ప్రాంతాల నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

## హాజరు పట్టిక పరిశీలన



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 27- నంద్యాల శ్రీనివాస్ నగర్ పంపు హౌస్ నందు సోమవారము మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి హాజరు పట్టకను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రైతు నగరం. పొన్నాపురం. పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు నిర్వహించారు. 36 వ వార్డు సచివాలయంను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. 36-20 వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను డ్రైనేజీ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారం వేయడం వల్ల మురికి కాలువలు నిండి పోతున్నాయని ఆయన అన్నారు. ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట . అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయం. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దళిత గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం దారుణం: జిల్లా సీపీఐ నాయకులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 27-నంద్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక శాసనసభ్యుడు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి తన ఓట్ల రాజకీయం కోసం సినీ నటుడు అల్లు అర్జున్ ను పిలిపించడం జరిగిందని కానీ అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం స్థానిక జిల్లా పోలీసు అధికారులు కిందిస్థాయి దళిత గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం దారుణమని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట రాముడు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నాగరాముడు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి ధనుంజయుడు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్.ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిప్రభాకర్. సిపిఐ జిల్లా సమితి సభ్యులు. వై. భార్గవ్. నారాయణ. బాలకృష్ణ.హరినాథ్.ఆర్ సామేలు. సురేషు. తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి





ఆళ్లగడ్డ ప్రతినిధి మే 27 విభారె న్యూస్:- జిల్లాలో ఎక్కడైనా శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం అయినప్పుడు అల్లరి మూకను ఎలా అదుపు చేయాలి, ఎలా చెదరగొట్టాలనీ తెలియజేస్తూ జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నాలుగు రోడ్ల లో జిల్లా పోలీసులు మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి పోలీసులు ఇప్పటి నుండే సమాయత్తమై ఉన్నారనే సందేశాన్ని జిల్లా ప్రజలకు ఈ మాక్ డ్రిల్ ద్వారా తెలియజేస్తున్నాం అన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, అలాగే సెక్షన్ 144 సి ఆర్ పి సి, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ కూడా అమలులో ఉందన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా అట్టి వారిపై పోలీసులు తీసుకుని చర్యల గురించి జిల్లా ప్రజలకు (ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రజలకు )తెలియజేసేందుకు మాకు డ్రిల్ చేశామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లును అవసరమైన మేరకు బైండోవర్, హౌస్ అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా నాకా బందీలు, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్, ఫ్లాగ్ మార్చ్ వంటి కార్యక్రమాలు చేస్తూ అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీసులు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**